కథా నిలయం
శ్రీకాకుళం

# వ్యక్తులూ - విలువలూ

ఒక వ్యక్తికోసం నేను చాలాకాలంగా అన్వేషిస్తున్నాను. పోనీ అతడు కనిపిస్తాడేమోనని చూస్తున్నాను. ఏనాటికైనా అతను నా చూపుల్లోపడితే పట్టుకుని మనసారా అతనికి క్షమాపణ చెప్పుకోవాలి. ఎంచేతంటే అతనికి తెలియకుండా దారుణమైన ద్రోహం ఒకటి అతనికి చేశాను.

చాలాకాలంక్రింద రామ్మూర్తికోసమని వాళ్ళయింటికి వెళ్ళాను. రామ్మూర్తి లోపల ఏదో పనిలో వున్నట్లున్నాడు. డ్రాయింగు రూమ్‌లో ఒక నూతనవ్యక్తి కూర్చునివున్నాడు నేనూ ఓ సోఫాలో కూర్చున్నాను.

నేను వచ్చానని తెలిసి రామ్మూర్తి తను చేస్తున్న పని మధ్యలోనే ఆపి మా దగ్గరకు వచ్చాడు; తనని కొంచంసేపటిదాకా క్షమించాల్సింది అన్నట్లుగా మొహం పెట్టాడు. "పర్వాలేదులే. ఒక పావుగంట కూర్చుంటాం. పనిచూసుకురా" అన్నాను సానునయంగా.

"సరే అయితే. అంతవరకూ మీ రిద్దరూ కలిసి కాలక్షేపం

చేస్తూవుండండి. సారీ ! మీ యిద్దర్నీ పరిచయంచేయటం మరిచే పోయాను" అంటూ.

నా గురించి అతనికి చెప్పాక !

"ఈయన మిస్టర్ ముకుందరావు. వీరికి ఒక ఊరంటూలేదు. వ్యాపారంమీద అనేక వూళ్లు తిరుగుతూవుంటారు. ఇన్నాళ్ళకి — యివాళ్టికి యీ వూరు రావటం తటస్థించింది. చిన్నప్పుడు యిద్దరం బడిలో కలిసి చదువుకున్నాం" అని చెప్పాడు. తర్వాత తనపని తీరిపోయినట్లుగా లోపలికి వెళ్ళిపోయాడు.

చాలా మామూలుగా మేమిద్దరం లోకాభిరామాయణంలో పడ్డాం. రామ్మూర్తి గడువుపెట్టిన పావుగంటలో పదినిమిషాల్లో మేము యించుమించు ప్రపంచాన్ని చుట్టివచ్చాం. కాని ముకుందరావంటే నాకేం ఆప్యాయత గౌరవం కలగలేదు. ఆయన వ్యాపారం మీద అనేకవూళ్ళు తిరగే మనిషి. అటువంటివాడికి నీతి, ధర్మం వున్నాయంటే ఎలా నమ్మేది ? మా సంభాషణ కేవలం లాంఛన ప్రాయంగా నడిచింది. పైపెచ్చు ప్రపంచంలో తనకు తెలీని విషయం, తను వేలుపెట్టని వ్యవహారం లేనట్లు అతను మాట్లాడటంతో అతని డాంబికంచూసి ఒకవిధమైన జుగుప్సకూడా కలిగింది.

"నాకు యితర విషయాలంటే ఎంత ఆసక్తివుందో తమాషాలు చేయటంలోనూ అంతే అభిలాష వుంది" అంటూ "మనం యిప్పుడో తమాషా చేద్దామా ?" అన్నాడు.

చేద్దాం అనకుండా "చేయండి" అన్నాను.

"అయితే యిలాచూడండి."

అతను చూడమన్నవైపు చూశాను; అంటే బల్లమీదవున్న లావైన ఒక పుసకంవైపు. ఆ పుస్తకం రెండువందల డబ్భయ్యో పేజీలోంచో, మూడొందల ఎనభయిమూడో పేజీ లోంచో ఒక కాయతం తొంగిచూస్తోంది. మామూలు కాగితం కాదు. ఆ కాయితం మారిస్తే నూరు చిన్నకాగితాలు వస్తాయి.

"ఏం చేద్దాం?" అన్నాను బిక్కమొహం పెట్టి.

"వాడి నిర్లక్ష్యం చూడండి. ఇన్నాళ్ళుగా యిన్ని వూళ్ళు తిరుగు తున్నాను. ఒక అణా డబ్బులయినా ఆదమరుపున పారేసు కున్నానా? ఉహుఁ. వీడిలా వందలకు వందలు అలా పుస్తకాల్లో పెట్టేస్తూంటే పిల్లలు పెడతాయనా వీడి అభిప్రాయం!" అని ఓ క్షణం ఆగి "దీన్ని తీసి దాస్తాను. వాడెలా కంగారుపడతాడో చూద్దాం. ఆ కంగారుతో డబ్బువిలువ తెలిసివస్తుంది" అని ఆ నోటుతీసి జేబులోకి తోసేశాడు.

నా కేమిటో యీ తమాషా అంత నచ్చలేదు. పైగా మోటు హాస్యంగా భావించాను. రామ్మూర్తితో యిన్నాళ్లుగా స్నేహం చేస్తున్నా. యిటువంటి తమాషాలు చేయగల అవకాశాలు చాలా వచ్చినా ఎప్పుడూ అటువంటివాటిల్లో తల దూర్చలేదు. కాని కొత్తగా పరిచయమైన వ్యక్తి. ఏం చేయను?

రామ్మూర్తి యింకో నిమిషంలో ఊడి, బయటపడతాడనగా "విషయం క్లయిమాక్సు అందుకొనేసరికి అసలు విషయం నేనే బయటపెడతాను. మీరు మాత్రం తొందరపడి బయటపెట్టేరు సుమా. తమాషా చెడిపోతుంది" అని సలహా యిచ్చాడు.

రామ్మూర్తి ముఖాన్ని తెలుపు చేసుకుని బయటకు వచ్చాక ముగ్గురం అటు బజారువైపు వెళ్ళాం. దార్లో కాఫీ తాగాం.

కాసేపు అటూ ఇటూ తిరిగాక రామ్మూర్తి చేతిలో అలావాటి పుస్తకం వుంది.

కొనవలసిందంతా కొని వెచ్చాలు యింటికి పంపించే ఒప్పందం అయాక రామ్మూర్తి వందరూపాయల నోటుకోసం పుస్తకమంతా కలయవెదికాడు. ఏవేవో పేజీ నంబర్లు గుర్తు తెచ్చుకుని ఆ పేజీల్లో చూశాడు. తర్వాత మొహం తేలవేశాడు. మళ్ళీ తను అల్లా మొహం పెట్టినందుకు మేము బాధపడతామనో మామూలుగా వుండేందుకు ప్రయత్నించాడు. అతని ఆలోచన్లు రకరకాలుగా సాగాయి. కొంచెంసేపు తను ఆ నోటు పుస్తకంలో పెట్టినమాట ఖాయమేనా కాదా అని ఆలోచించాడు. "పుస్తకంలో పెట్టకపోతే యింకా ఎక్కడ పెట్టివుంటాను?" అని ప్రశ్నించుకున్నాడు. ఈవిధంగా ఆలోచన రకరకాలుగా సాగాక చివరికి ఆ నోటు డ్రాయర్లో ఎడమవైపు సొరుగులో ఫైల్సుమధ్య పెట్టినట్లు గుర్తువచ్చింది రామ్మూర్తికి. ఈ ఆలోచన్లు అతను లోపల్లోపలే చేసుకోక బయటకు కూడా వెలువరిస్తూన్నందువల్ల అతనేవిధంగా ఊహించుకుంటున్నాడో మాకూ తెలిసింది.

అయితే రామ్మూర్తి యిలా ఆత్మద్రోహం చేసుకుంటున్నాడంటే నాకు చెప్పరాని బాధ కలిగింది. అతను పుస్తకంలో పెట్టినమాట ముమ్మాటికీ నిజం. కాని ఆ పుస్తకందగ్గర పావుగంటసేపూ, అంతకంటే ఎక్కువసేపూ కూర్చున్న యీ ఆప్తమిత్రులు తమాషాకో. నిజంగానో ఆ నోటుని అపహరించివుంటారని అనుమానించకపోవటం నాకు మరీ ఆశ్చర్యం కలిగించింది. రామ్మూర్తి స్థితిగతులు నాకు తెలీనివికావు, వందరూపాయల

కాయితం అంటే అతనికి ఎంత పెద్దవస్తువో కూడా నాకు తెలుసు. అటువంటప్పుడు అది డ్రాయర్లోనో ఎక్కడో వుండి వుంటుందనుకుని ఎంత సమర్థించుకుంటున్నా బాధపడకుండా వుంటాడని ఎలా నమ్మేది?

షాపువాడిని డబ్బు తర్వాత యిస్తానని ఒప్పించి "పదండి. అలా లైబ్రరీదాకా పోయివద్దాం. ఈ పుస్తకం అక్కడ యిచ్చేయాలి" అన్నాడు. ఎంత కూడదనుకున్నా అతని గొంతులో కంగారు అనేది ధ్వనిస్తూనేవుంది. ఈ సమయంలో నేను ముకుందరావు మొహంవంక చూశాను. అతనూ నావంక చూసి చిన్నగా నవ్వాడు. అతని నవ్వుచూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. అతనంటే కలిగిన జుగుప్స యింకొంచం పెరిగింది. ఎంతసేపని తమాషా? తమాషాలకికూడా ఒక హద్దూ పద్దూ వుండాలా? అదీగాక క్లయిమాక్సు యిందాకే అందుకున్నదాయె. ఓవిధమైన అసహ్యంతో తల ప్రక్కకి తిప్పుకున్నాను.

లైబ్రరీలో పుస్తకాన్ని యిచ్చివచ్చేందుకు రామ్మూర్తి లోపలకు పోయినప్పుడు అతను నాతో అన్నాడు. "చూశారా? మనుషుల స్వభావాలు. ఎంతవింతగా వుంటాయో! కొద్దిగంటలక్రితం రామ్మూర్తి తన చేతుల్తో యీ పచ్చకాయితాన్ని ఆ పుస్తకంలో పెట్టాడు. ఇప్పుడు ఆ విషయాన్ని తనే నమ్మలేని స్థితికి వచ్చాడు. పైగా యింకా ఎక్కడెక్కడో పెట్టాననుకుంటున్నాడు. ఇటువంటి చిన్న చిన్న సంఘటనలవల్లే వివిధమనస్తత్వాల పరిశీలన చేయవచ్చు...." అంటూ ఏదో సైకాలజీ చెబుతున్నాడు. 'ఊఁ' కొట్టటంమినహా నేను యింకేమీ చేయులేదు. చేయలేకపోయాను.

రామ్మూర్తి ఆ పుస్తకాన్ని లైబ్రేరియన్‌కి అప్పజెప్పేలోపల రెండు మూడుసార్లు మళ్ళీ ఆ పేజీలన్నిటినీ వెతికి వుంటాడనటంలో సందేహంలేదు. కొంతసేపటికి మాదగ్గరకు వచ్చాడు.

చీకటిపడబోతుండగా యింటిదారి పట్టాము. దార్లో రామ్మూర్తి "అదికాదు ముకుందం. ఇవాళే వెళ్ళాలని తొందరేముంది? రేపు వెళ్ళకూడదూ?" అన్నాడు.

"కాని రామ్మూర్తీ ఎలా వీలవుతుంది? నా వ్యవహారాలూ, వ్యాపకాలూ అదంతా నీకు తెలుసాయె. టైమంటే నాకు ప్రాణప్రదం. ఒకనిమిషం వేస్టు చేయాలంటే మనస్సు చివుక్కుమంటుంది. ఇవాళ రాత్రికే వెళ్ళిపోవాలి" అన్నాడు ముకుందరావు.

రామ్మూర్తి నావైపు తిరిగి "అయితే నువ్వు మాయింట్లోనే భోజనం" అన్నాడు.

"ఎందుకులే? మాయింటికి వెళ్ళిపోతాను" అన్నాను ముక్తసరిగా.

"అలాకాదు. సరదాగా ముగ్గురం కలిసి కబుర్లు చెప్పుకోవచ్చు. తర్వాత యిద్దరం కలిసి ముకుందాన్ని ట్రెయిన్ ఎక్కించి వచ్చేద్దాం" అని పట్టుబట్టాడు. నాకు ఒప్పుకోక తప్పలేదు.

రామ్మూర్తి యింట్లో భోజనాలతోసహా, కబుర్లలో రెండు గంటలు గడిపాము. నావిషయం ఎలావున్నా రామ్మూర్తిమాత్రం చాలా హాయిగా వున్నాడు. ముకుందరావు జోక్సు, మాటల చాతుర్యం అతనికి చాలా సంతోషం కలిగించాయి. ఆ సంతోషంలో అతను యింటికి వచ్చాక పచ్చకాయితాన్ని వెదుక్కో-

వటం కూడా మరిచిపోయాడు. ఇందాక ముకుందరావు చెప్పిన సైకాలజీ నాకు యిప్పుడు కొంచెంగా అర్ధమయింది.

ట్రెయిన్ టైము అయేసరికి ముగ్గురం స్టేషన్‌కు వెళ్ళాం. రైలు ప్లాటుఫారంమీద సిద్ధంగావుంది. బయలుదేరేందుకు యింకో అయిదు నిమిషాలకన్నా ఎక్కువ వ్యవధి లేదు. ముకుంద రావును ఒక యింటర్‌క్లాస్ కంపార్టుమెంటులో ఎక్కించి మేము ప్లాటుఫారంమీద నిలబడి మాట్లాడసాగాము. కొంత సేపటికి సిగ్నల్ యివ్వబడటం కూఢా జరిగింది. నాకు మండి పోతోంది. ఏమిటీ పెద్దమనిషీ? ఈ తమషాకేమన్నా అంతూ పొంతూ వుందా? మరీ విసిగిపోయి నేనే బయటపెడదామను కున్నాను. కాని సభ్యత అడ్డువచ్చింది.

చూస్తూ చూస్తూండగానే రైలు కూతవేయటం, ప్లాటుఫారం విడిచి వెళ్లిపోవటంకూడా జరిగింది. నా ఆశ్చర్యానికి, అస హ్యానికీ అంతులేకుండాపోయింది. వెళ్తూండగా మహావినయంగా సెలవు పుచ్చుకున్నాడు. ఆ దొంగ పెద్దమనిషి మాటలు విన టానికి కూడా నాకు యిష్టం లేకపోయింది.

తిరిగి వస్తూ దార్లో రామ్మూర్తిని అడిగాను "అతన్ని గురించి నీఅభిప్రాయం ఏమిటి?"

ఇహ రామ్మూర్తి వర్ణించుకు వచ్చాడు. ఇంటికి చేరేదాకా అతని గురించి మంచివిషయాలే చెబుతూవచ్చాడు. ప్రతి విషయం లోనూ ఆతని ఘనతను నిరూపించాడు. అతను యీరాత్రి వెళ్లి పోవటం తనకి సుతరామూ యిష్టం లేదన్నాడు. రామ్మూర్తి ధోరణి నాకేం నచ్చలేదు. ముకుందరావును రామ్మూర్తికన్నా నే నెక్కువ అర్ధం చేసుకున్నాను. అదయినా అత నీవూరు

విడిచి వెళ్ళిపోయే క్షణంలో. అతనా కాయితం దాచి తమాషా ఎందుకు చేయాల్సివచ్చిందో యిప్పుడు గ్రహించాను. అయితే యిటువంటి మనుషుల్ని నే నిదే ప్రథమంగా చూడటం. కాని రామ్మూర్తికి మాత్రం అతనంటే అభిప్రాయం మారదుగదా. జరిగిన విషయం అతనికి చెప్పటం నాకిష్టం లేకపోయింది. అతని హృదయంలో ముకుందరావు ఒక ఉన్నతమైనస్థానం ఆక్రమించి కూర్చున్నాడు. దాన్ని కదిలించటం ఎందుకు? "ఇందాకపోయిన డబ్బును వెదికావా?" అని అడగటంకూడా యిష్టంలేకపోయింది. అడిగినట్లయితే ఆ రాత్రికి అతనికి శాంతి లేకుండా చేయాల్సివస్తుంది.

అందుకని ఆ రెండువిషయాలని గురించీ ఒక్కమాటయినా బయటికి చెప్పకుండా, మాయింటికి చేరేసందు వచ్చేటప్పటికి "గుడ్ నైట్" చెప్పి వెళ్లిపోయాను. ఆరాత్రి ముకుందరావు చేసిన "తమాషా" గురించి చాలా ఆలోచించాను. అంత వ్యాపారస్థుడు అయివుండి, బాగా డబ్బుగలవాడు అయివుండి అతనటువంటి "తమాషా" ఎందుకు చేయవలసివచ్చిందో అర్థం కాలేదు. ఇంకో ఆలోచన కలిగేటప్పటికి విస్మయంకూడా కలిగింది: నా ముందు అతనటువంటి పనిచేసి నేను రామ్మూర్తి ముందు బయటపెడతానని ఎందుకు అనుమానించలేదు? నేను చెప్పేస్తే అతనికున్న గౌరవం ప్రతిష్ఠ ఏమయిపోతాయి?

కాని దానికి సమాధానంగా యింకో ప్రశ్నలాంటిది ఉదయించింది: "అతను భయపడవలసిన అవసరం ఏముంది?

ముకుందరావు తెలివితేటలకు ఆశ్చర్యంవేసింది. నేను బయటపెట్టలేనని అతనికి తెలుసు, వ్యక్తుల తత్వాలను అవగాహనం

చేసుకుంటే వ్యవహారాలు ఎంత సులభంగా నడిపించవచ్చో అర్థమైంది.

ఇది జరిగిన మూడోనాటి సాయంత్రం రామ్మూర్తి, నేను చల్లగాలికి బయల్దేరాము. మా యిద్దరిమధ్యా అనేక విషయాలు వచ్చాయి. నాకుమట్టుకు ఏదో వెలితిగానే వుంది. రామ్మూర్తి ముందు ఏదో దాస్తున్నానని బాధగావుంది. ఈ రెండు రోజుల్లోనూ నేను ముకుందరావును మరిచిపోలేదు. అతన్ని ఎంత నీచంగా చిత్రించుకొవాలో అంత నీచంగా చిత్రించుకుని అతనికి నాలో ఒకస్థానాన్ని ఏర్పరిచాను.

అకస్మాత్తుగా రామ్మూర్తి అన్నాడు. "ఇవాళ చిత్రం జరిగింది" అతనామాటలు అనకుండావుంటే "రెండురోజులక్రితం నేనో విచిత్రమైన దొంగను చూశాను...." అంటూ ఆ దొంగను గురించి, దొంగతనాన్నిగురించి పరోక్షంగా అసలు విషయం బయటపెట్టకుండా ఉపాయంగా చెప్పుకుపోదా మనుకుంటున్నాను.

కాని అతనామాట అనటంతో అదంతా మరిచిపోయి "ఏమిటి?" అనడిగాను కుతూహలంగా.

"నాకు ముకుందరావు వందరూపాయలు ఎమ్. ఒ. చేశాడు?"

"అదేమిటి?? తెల్లబోయాను.

"ఆవేళ నా వందరూపాయలనోటు కనిపించలేదు, గుర్తుందా?"

"ఊఁ"

"మరునాడు యిల్లంతా వెదికాను. కనిపించలేదు, పోయిందని నిస్పృహచెంది వూరుకున్నాను" అని కొంచెం ఆగాడు.

నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"కాని యివాళ ముకుందరావు వందరూపాయలు పంపిస్తూ ఓఉత్తరం రాసాడు. ఆరోజున పుస్తకంలో పెట్టివుంచే తమాషా చేసి ఏడిపిద్దామని తీసి దాచాడుట. విషయం కొట్టుమాక్కువరకూ పోయాక యిద్దామనుకుని మాటల్లోపడి మరచిపోయాడుట. ఇప్పుడు పంపించేస్తూ క్షమాపణ అడిగాడు" అని కొంచం ఆగి....

"అందుకే ముకుందరావును నే నంత గౌరవిస్తాను. ప్రతి విషయంలోనూ యితరుల కెవరికీ కనిపించని ప్రత్యేకత అతనికి కనిపిస్తూ వుంటుంది. ఇతరు లెవ్వరూ ఊహించని పనులు అతను చేస్తూవుంటాడు. ఉదాహరణికి నువ్వే ఆ నోటుని చూశావనుకో; ఆ స్థితిలో, నువ్వు అలా తీసి దాచి ఏడిపించటానికి యిష్టపడవు. మెదలకుండా వూరుకుంటావు. లేకపోతే నా అజాగ్రత్తకు నాలుగు చీవాట్లువేసి దాన్ని తీసి భద్రపరచమంటావు. అంతేనా ?" అంటూ అంతటితో ఆగక, యీ అవకాశాన్ని పురస్కరించుకుని ముకుందరావును గురించి యింకా చాలా చెప్పాడు. కాని యీసారి నేను అతను చెప్పేది త్రోసివేయక శ్రద్ధాభక్తులతో విన్నాను.

రామ్మూర్తి యిలా వున్నవిషయం బయటపెట్టటంతో నేను తల్లక్రిందులైపోయాను. ఒకరకం సిగ్గు నన్నావహించింది. ముకుందరావును గురించి యిదివరకు నాకున్న ఊహల్లో ఏ ఒక్కటీ రామ్మూర్తికి చెప్పలేకపోయాను. ఆ విషయాలేవీ అతనికి తెలియకుండా వుంచేనే బావుంటుందని నా ఉద్దేశం.

అయితే వందరూపాయలు విలువగల కాయితాన్ని తమాషాకే సంగ్రహించి, మళ్ళీ అది యివ్వకుండా మరిచిపోయి వెళ్ళిపోవటం నమ్మదగిన విషయమా ?

ఏం ? ఎందుకు నమ్మదగిన విషయంకాదు ? వందరూపాయలు పోయాయనో, ఎక్కడో డ్రాయర్లోపెట్టి వుంటాననో సందేహంలోవుండి, యింటికిపోయి వెతకాలి అనుకున్న రామ్మూర్తి కబుర్ల కులాసాలోపడి ఆ విషయం మరిచిపోలేదా ?

ఇలా సమాధానం చెప్పుకున్నాక నన్ను తృప్తీ, అసంతృప్తీ రెండూ ఆవహించాయి. ముకుందరావును ఎప్పుడో ఓసారి కలుసుకుని, రామ్మూర్తికి తెలియకుండా మానసికంగా అతనికి చేసిన ద్రోహానికి క్షమాపణ కోరుకుంటేగాని నాలో అసంతృప్తి అణగారదు.

— —